# నాలుగు దయ్యాలు

రెండవ బహుమతి

(రూ. 25/-)

"సరూ ... సరోజా ... లేవవే తల్లీ!"

'అబ్బా! ఏమిటే నీ గోల? అప్పుడే కాఫీ బెల్ అయిందా?' కళ్ళు తెరవకుండానే బద్ధకంగా పక్కకు ఒత్తిగిల్లి మరింతగా ముడుచుకుని పడుకుంటూ అడిగాను.

"నీ మొహం బెల్లు కొట్టారు! ముందు లేస్తావా లేదా? నాకు భయంవేస్తూందే సరూ ... లేచి రావే...' కొద్దిగా వణుకుతున్న గొంతుతో అంటూ, దుప్పటి లాగి పారేసింది కమల.

నిద్రమత్తు ఎగిరిపోగా వులిక్కిపడి లేచి కూర్చున్నాను. 'భయమా? ఎందుకూ?'

మాట్లాడకుండా కిటికీ దగ్గరకు నడిచి నన్ను రమ్మని సైగ చేసింది. అయోమయంగా లేచి వెళ్ళాను. అది చూస్తున్న వైపు నేనూ చూడసాగాను. పలుచని మబ్బుతెరలా కమ్ముకున్న పొగమంచు, క్రింద కూడా మరో ఆకాశం వెలిసిందా అనిపింపజేస్తూంది. దూరాన వున్న కొండలు పొగమంచు తెరల గుండా గమ్మత్తుగా కనబడుతున్నాయి. ఆరు గంటలయినా ఇంకా లేద్దామా వద్దా అని తటపటాయిస్తున్నట్టు మబ్బుల దోమతెరలను తొలగించుకుని తొంగి చూస్తున్నాడు సూర్యుడు. 'ఏముందక్కడ?' కొంగుతీసి చెవుల మీదుగా కప్పుకుంటూ వింతగా అడిగాను. రెప్ప వాల్చకుండా బయటకు చూస్తూ నిలబడిన కమల దూరాన కొద్దిగా ఎత్తుగా గుట్టలా వున్న ప్రదేశంవైపు వేలుపెట్టి చూపించింది. 'అటుచూడు! ఎవరో నలుగురు నిలబడినట్టు లేదూ?'

పరీక్షగా చూశాను. నిజమే! నాలుగు తెల్లని ఆకారాలు స్పష్టంగా కనపడ్డాయి. కొద్దిగా వూగుతున్నట్టు కూడా అనిపించింది. 'ఎవరో పని మీద వెళ్లారేమో ...' సందేహంగా అన్నాను.

ఉరిమిచూసింది కమల. 'మనుషులయితే కదలకుండా అక్కడే బొమ్మల్లా ఎందుకు నిలబడతారు? నిన్న అరుణ చెప్పలేదూ, ఇక్కడ దయ్యాలున్నాయని? అవేనేమో...'

భయంగా మళ్ళీ వాటివైపు చూస్తూ అంది.

'నాన్‌సెన్స్! దయ్యాలనేవి లేవసలు! అదేమిటో మళ్ళా చూద్దాంగానీ ముందు మొహం కడుక్కుందాం పద!' అంటూ దాన్ని బయటకు లాక్కుపోయాను. అప్పుడే ఒకరిద్దరు పిల్లలు లేచి డిసెంబరు పువ్వులు కోస్తున్నారు. ప్రేయర్ హాల్లోనుండి 'కౌసల్యా సుప్రజారామ' అంటూ సుప్రభాతం వినబడుతూంది. అంతలో ముత్తుస్వామి బెల్లు కొట్టడంతో డైనింగ్ హాలు కేసి దారితీశాము. కాఫీ త్రాగి రూముకు రాగానే కిటికీ దగ్గరకు పరిగెట్టింది కమల. 'అరె! చూడు సరూ! ఇప్పుడు లేవు అవి!' భయంతోబాటు ఆశ్చర్యం కూడా మిళితమైన స్వరంతో అరచినంత పని చేసింది కమల.

'నిజంగా?' అంటూ ఒక్కవుదుటున కిటికీ దగ్గరకు వెళ్ళి చూశాను. బాగా తెల్లవారిపోయిందేమో, 'భీమాస్' కాంటీన్ వెనకగా వున్న ఆ గుట్టవంటి చోటు ఇప్పుడు స్పష్టంగా కనబడుతూంది.


కుమారి
కె. మీరాబాయి
ప్రీవియస్ యం. ఎ.
(ఇంగ్లీషు)
వెంకటేశ్వర యూనివర్శిటీ
తిరుపతి.


కానీ... ఆ నాలుగు ఆకారాలు మాయమయ్యాయి! ఆశ్చర్యంగా మొహాలు చూసుకున్నాం. 'నే చెప్తే విన్నారా? డెఫినిట్‌గా దయ్యాలే అవి...' బెదురుగా చూస్తూ అంది కమల. నాకూ అనుమానంగానే వున్నా ఆమాట అన్నానంటే కాలేజి వదిలిపెట్టి ఇంటికి పరిగెడుతుంది పిరికిపిల్ల! అందుకే 'నిద్రకళ్ళతో చూసి వూరికే భ్రమపడి వుంటాములే వే! దయ్యాలూ, భూతాలూ అనబోకు, నవ్వేరు నలుగురూ!' అంటూ చివాట్లేశాను. అప్పటికి మరేమీ మాట్లాడకుండా వూరుకున్నా ఆ సంగతి మాత్రం మరచిపోలేదా అమ్మాయి.

'పొద్దున్న వాటిని చూస్తుంటే 'మాక్‌బెత్'లో త్రీ విచెస్ గుర్తొచ్చాయి! ఎంత భయమేసిందో తెలుసా?' సాయంత్రం అటెండెన్స్ టైములో మెల్లిగా అంది—

'ఇంకా నయం! హామ్లెట్‌లో 'ఘోస్ట్' గుర్తుకురాలేదు. వుత్త పిరికిగొడ్డు' అంటూ చిన్నగా నెత్తిమీద మొట్టాను.

రాత్రి పదిగంటలకే నిద్ర వస్తూందంటూ పడుకొంది కమల. కళ్ళు మూతలు పడుతున్నా పదకొండుదాకా ఏమయినా సరే మేలుకోవాలన్న పట్టుదలతో చదువుతూ కూర్చున్నా! 'వెదర్ ఇయాగో ఈజ్ ఎ డెమి-డెవిల్' అన్న దాని మీద ఎస్సే చదువుతుంటే అనుకోకుండానే కిటికీవైపు దృష్టిపోయింది.

కొద్దిగా భయంవేసి లేచి వెళ్ళి కిటికీ మూసేశాను. వాచీ చూస్తే పదకొండయింది. వాచ్‌మాన్ గంట గణగణలాడించాడు. "లైట్లార్పేయండో హెూయ్!" అంటూ. లైట్లార్పి పడుకున్న పదినిమిషాలకల్లా కమల వచ్చి నా దోమతెరలో దూరింది. "భయమేస్తోందే సరూ!" అంటూ. ఎప్పుడు నిద్రపోయానో... పొద్దున్న కమల తట్టి లేపితే కళ్ళు తెరిచాను. "సరూ. అవి మళ్ళా వచ్చాయే..." రహస్యంగా చెప్పింది కమల. ఒక్క గంతులో కిటికీ దగ్గరకు వెళ్ళి చూద్దునుగదా! అదే ప్రదేశంలో మసక వెలుగులో పొగమంచు మధ్య తెల్లగా బొమ్మల్లా నాలుగు ఆకారాలు ప్రత్యక్షమయ్యాయి. చెప్పొద్దూ? బీరాలు పలికే నాకు గుండెల్లో వణుకు పుట్టింది.

"కదులుతున్నట్టున్నాయి చూడవే... ఇక రెండ్రోజులుపోతే మన రూము దగ్గరకే వస్తాయేమో... ఎలా?" దగ్గరగా జరిగి నా చెయ్యి గట్టిగా పట్టుకుని వణుకుతున్న గొంతుతో అంది కమల. ఆ పిల్ల చెయ్యి వణుకుతూంది. చూస్తూ వుండగానే కాసేపటికి వున్నట్టుండి ఆ దృశ్యమయ్యాయి నాలుగు దయ్యాలూ!

"నే చెప్తే కాదన్నావు! చూశావుగా... అటువైపు వింగ్‌లోకి మారిపోదామే సరూ... చస్తే ఈరూములో మాత్రం వుండను..." ఏడుపు మాత్రమే తరవాయిగా వుంది కమల పరిస్థితి. నాకూ ఏం మాట్లాడాలో తోచలేదు!

ఆ సాయంత్రం కమలకు హైఫీవర్ వచ్చేసింది. రాత్రంతా "దయ్యాలేనే సరూ ... నే నిక్కడ వుండనండీ..." అంటూ ఒకటే పలవరింతలు. తెల్లవారేసరికి సంగతి తెలిసి డెప్యూటీ వార్డెన్ వచ్చారు మా రూముకు.

"మేడమ్... నేనీ రూములో వుండనండీ ...!" ఆవిడను చూడగానే నీరసంగా అంది కమల. నే నిక దాచుకోలేక సంగతంతా విప్పి చెప్పా నావిడకు.

ఆవిడ పగలబడి నవ్వడం మొదలుపెట్టారు! అసలే చక్కని మనిషేమో, నవ్వుతుంటే మరింత అందంగా వుంటారామె. నవ్వుతుంటే బుగ్గలమీద తొంగిచూస్తున్న గులాబి రంగును చూస్తూ ఎందుకు నవ్వుతున్నదో అర్థంకాక తెల్లమొహం వేసుకుని నిలబడ్డాను.

ఇంతకీ ఆవిడ చెప్పిన విషయం ఇది: మేము దయ్యాలనుకొన్నవి ఎన్.సి.సి. వాళ్ళు గురికోసం పెట్టుకునే టార్గెట్స్‌ట. వాళ్ళు షూట్ చేసే శబ్దం మాకు వినబడదు గనుక అవి వున్నట్టుండి మాయమయినట్టు కనబడ్డాయన్నమాట! అంతేకథ!

□□□